# నోరులేని జీవుడు

శ్రీ మధురాంతకం రాజారాం

దేవళం మిట్ట వరదరాజులు నోరులేని జీవుడు. ఈ మానవులతణ్ణి ఎంతగా బాధించారని! నెలలతరబడీ తిండి లేకుండా నిండు పస్తులతో మాడ్చేశారా! వెలుగన్నది కంటికి కనిపించకుండా తలుపులు మూసేశారా! ఇంత చేసినా ఎక్కడ తప్పించుకపోతాడోనని ఒకదాని కొకటి జతగా యింతింతలేసి తాళాలు రెండు బిగించారా! ఎన్ని మల్లగుల్లాలు పెడితే నేమి? మహానుభావుడు దేవళంమిట్ట వరదరాజులు. అతడేమైనా ఉలికాడా? లేదు. పలికాడా? లేదు.

* * * *

హేమంత నిశీథం. నక్షత్రాల చెద పురుగులు తొలిచివేయగా ఆకాశసౌధనుంచి నుసిరాలిపోతున్నట్టు మంటికీ, మింటికీ ఏకంగా పడుతోంది మంచు. నిద్రపోతున్న మనిషిని తల్పంపైన పరుండబెట్టి, అతడు చేసిన కాటుక కొండల్లాంటి పాపాలు షికారుకు బయల్దేరి వచ్చినట్టుగా కొటమరాజు కొండలు నల్లటి మంచు గడ్డల్లా బిగుసుకపోయి దిక్కులకు హత్తుకుని పడివున్నాయి. ఆకు కదలని మల్లమ్మ కోన అవినీతిని అన్యాయాన్ని చూచి చేష్టలుదక్కి స్థాణువులా మిగిలిపోయిన మానవుడి అంతరాత్మను తలపింపజేస్తోంది. ఉన్న ఒక్క కాలుకూడా విరిగిపోగావూళ్ళో వుండలేక అడవిదారి పట్టిన ధర్మగోవుకు అక్కడగూడా వైరివర్గం ఏర్పడింది కాబోలు! గంభీరమైన నిస్తబ్ధతకు భంగం కలిగిస్తూ గుంటనక్కలు గొంతు చించుకుంటున్నాయి.

మంచుగాలికి చెమ్మగిల్లి రబ్బరులా సాగిపోతున్న దుప్పటి కప్పుకొని కొంకర్లు తిరుగుతున్న చేతివ్రేళ్ళమధ్యనుంచీ బీడీ పొగను ఆస్వాదిస్తున్నాడు సుబ్బయ్యా. అతడు కూర్చున్నది రావిచెట్టుక్రింద. కానీ బోధివృక్షం క్రింద కూర్చుని సుబ్బయ్యా చేస్తున్నది తపస్సు గాదు. నూటనలభైనాలుగో సెక్షను పుణ్యమా అని పదిహేను రోజులనుంచీ దేవళం మిట్టపైన పడిగాపులు పడుతున్న రక్షకభట చతుష్టయంలో సుబ్బయ్యా ఒక్కడు. మిగిలిన ముగ్గురూ కంబళిపొరక్రింద మోకాళ్ళను కడుపులో దాచుకుని మాతృగర్భస్థ శిశువుల్లా నిద్రపోతున్నారు.

'వీళ్ళ కెలా వస్తుందబ్బా యింత మొద్దునిద్ర'— ఆశ్చర్యపడుతున్నాడు సుబ్బయ్యా. ఇల్లు వదిలిపెడితే నిద్రపట్టని తనలాటివాడికి ఈపోలీసువుద్యోగం లాయకీ గాదు. ఉంటే ఈ రాఘవుల్లా ఉండాలి. మేలుకుంటే సినిమా పాటలు పాడడం, నిద్రపోతే గురకపెట్టడం— యివి తప్పితే మరొక పని తెలియదు వీడికి!...అలాగని సుబ్బయ్యా సంగీతమంటే చెవికోసుకుంటాడని కాదు. పోగా రాఘవులు నోరు తెరిస్తే సుబ్బయ్యా చెవులు మూసుకునేవాడు కూడా! కానీ దేవళంమిట్ట విక్రమాదిత్యుని సింహాసనంలా సుబ్బయ్యాలో మార్పు తీసుకొచ్చింది. దేవళం వెనుకవైపున కుప్పగా కూలిపోయిన ప్రాకారపు రాళ్ళలో ఎన్ని కొదమత్రాచులు నివసిస్తున్నాయో ఎవరు చూచారు? నెమిలి కూతకు జేజమ్మలాంటి రాఘవుల పాట వాటినలాగే నాగలోకానికి సాగనంపగలదని సుబ్బయ్యాకు తెలుసు. పాటంటే పడిచచ్చే నాగకన్యల గతే యిలాగుంటే, యిక రాఘవుల పాట అడివిమెకాలకు మాత్రం ఏం రుచిస్తుంది!

బీడీ ఆరిపోయింది. కాదు ఆరిపోయింది. ఎందుకంటే పెదవులు చురుక్కుమనేవరకూ, ఆఖరుబీడీ ఆర్పివేసే దురలవాటు సుబ్బయ్యా కెన్నడూ లేదు. ఇప్పటి కిప్పుడే అర్ధరాత్రి దాటినట్టుంది. ఇంకా అయిదారు బీడీ లుంటేగానీ తెల్లవారదు. ఇంతకూ అంతకూ ఆలోచనంటూ పెట్టుకోని సుబ్బయ్యా ఆలోచనలో పడ్డాడు. బట్టలను చల్లటిరాతి కానించి, నెరసిన మీసాలు మెలివేస్తూ అదేపోజులో నిద్రపోతున్న రంగసామి జేబులో రెండుకట్టల బీడీలున్నాయి. కాహళాలు మ్రోగించినా కదిలేవాడు కాడు గనుక కావలసినన్ని తీసుకోవచ్చు. ఐతే రంగసామి తొలికోడితోబాటు మేలుకోగానే తనజేబులోని వెలితిని పసిగట్టకపోడు. అతడి సందేహం దాని అలవాటుమేరకు గంగులుపైకి వెళ్తుంది. 'ఒరేయ్ గంగులూ! నీ పాడుబుద్ధి పోనిచ్చావు గాదురా! కాళ్ళూ

చేతులూ విరగ్గొట్టి నిన్ను పోలేరమ్మకు పొలిబెట్టినా పాపంలేదురా..." అంటూ ప్రారంభిస్తాడు రంగసామి 'తెట్టతేరకు నాపైన నేరంమోపితే నేను తలకాయ గిల్లేస్తాను. దానికొక మేకుదిగగొట్టి బొంగరంలా గిర గిరా త్రిప్పేస్తాను...' అంటూ బీరాలు వల్లిస్తాడు గంగులు, కాలక్షేపానికి ఆ వాగ్యుద్ధం చాలాబాగుంటుంది!

గుప్పటిలోనుంచీ చేతిని బయటికిచాపి రంగసామి జేబులోనుంచీ బీడీతీయబోతూ త్రుళ్ళిపడి లేచి నిల్చున్నాడు సుబ్బయ్య. గుడిలోపల ఏదో అలికిడి. ఎవరైనా తలుపులు తెరిచారా? లేకుంటే పాత్రలాంటిదేదైనా క్రిందపడి దొర్లిందా? అదీగాకపోతే తన చెవులే తనను మోసగించాయా? టార్చిలైటు చేతికి తీసుకుని చరచరా ముందుకు నడిచాడు సుబ్బయ్య. దీపకాంతి ప్రాకారకుడ్యం పైనించి పాతకాలంనాటి కొయ్యతలుపులపైకివచ్చి నిలిచింది. రాతిమెట్లెక్కుతూ 'ఎవరక్కడ, ఎవరక్కడ' అంటూ సుబ్బయ్య పెట్టిన కేకలు బండపైనించీ కిందికిదొర్లి కోనలోకిజారిపోయిన రాళ్ళకుమల్లే నిశ్శబ్దంలో కలిసిపోయాయి. తన బలాన్నంతా బాహువుల్లోకి తెచ్చుకుని సుబ్బయ్య కవాటాల్ని కదిలించాడు. ఆకదుపుకు నూరుగురు పసిబిడ్డలొక్కసారిగా ఏడుపు లంకించుకున్నట్టు తలుపులకు వ్రేలాడుతున్న చిరుగంటలు ఘల్లు ఘల్లుమని మ్రోగసాగాయి.

సుబ్బయ్య సహచరులు ముగ్గురూ ఉలికిపడి లేచికూర్చున్నారు.

"ఒరేయొరేయ్ సుబ్బయ్యా! ఏమిట్రా నాయనా! ఈ హంగామా? ఏం జరిగింది?" అన్నాడు రంగసామి.

అకారణంగా తనిలా కంగారుపడిపోతున్నాడేమో ననిపించి సుబ్బయ్య కించపడిపోయాడు. "ఏం లేదు లేవయ్యా రంగయ్య మామా! ఏదో సవ్వడివినిపిస్తే ఎందుకైనా మంచిదని"...అర్ధోక్తిలో ఆపాడు సుబ్బయ్య.

రంగసామి బిగ్గరగా నవ్వసాగాడు—"ఒరే సుబ్బయ్యా! మీరు కుర్రాళ్ళందరూ ఓ విషయం జ్ఞప్తిలో ఉంచుకోవాలి. ఎలుకను పట్టుకోదలిస్తే మొదట ఒకకన్నంమాత్రం వదిలిపెట్టి, మిగిలినవన్నీ మూసివేయడం ముఖ్యం. అలా చేయకుండా ఒక కలుగులో ఊదరపెడ్తే ఎలుక మరోకలుగుగుండా పారిపోతుంది. వృథాప్రయాస! వచ్చిపడుకో"...

"ఐనా పాడుపడిన కోటకు పందికొక్కు తలారులంలాగా మనమిక్కడుండగా తోకాడించడానికి ఎవడికెన్నిగుండెలు సుబ్బయ్యన్నా! నిల్చోబెట్టి నిలువునా చీల్చెయ్యమూ?" అన్నాడు గంగులు.

"లేచెరా మగధీరుడు" ... అందుకున్నాడు రాఘవులు.

"కోయ్‌రా బాబూ కోయ్. మోకాలెత్తు హెచ్చు, తక్కువా చూడబోకు"...

"చాల్లేగానీ, నువ్వెక్కడైనా గొంతుసవరించుకునేవు రాఘవులూ! నేను నిద్రపోవాలి. ఇంకా బోలెడంత రాత్రివున్నట్టుంది"...గంగులు కంబళి సర్దుకున్నాడు.

"నీ దిష్టి తగిలిందేమిటోరా గంగులూ! గొంతుక పచ్చి పుండులా వుంది. జలుబుతో ముక్కు మూసుకపోయింది. ఆ ఆచార్లు గారింటిదాకా వెళ్ళొద్దామా సుబ్బయ్యా! నాలుగు మిరియాలు తీసుకొచ్చి కాల్చి పొగ పీలిస్తేగానీ వూపి రాడేట్టు లేదు..."

"ఎలాగూ రేపటి ఏకాదశి నాకీనాడే వచ్చినట్టుందిరా రాఘవులూ! ఈ రాత్రంతా జాగరణమేననుకో! తప్పుతుందా మరి! వెళ్దాంరా. కానీ ఆ ఆచార్లుగారితో మాటాడ్డం మాత్రం నా చేత గాదురా బాబూ! ఆ పనేదో నువ్వే చూచుకోవాలి..."

నిజమే! ఆచార్లుతో సంభాషించడమేమంత తేలికైనపనిగాదు. మెగాఫోనులాంటి గొంతు అతనితో గుసగుస లాడటానికి మాత్రమే ఉపకరిస్తుంది.

లేకపోతే పట్టెడన్నంకోసం ఈ మట్టిగుట్టపైన పుడివుండేవాడేనా ఆచార్లు! పంచేంద్రియాలూ సరిగ్గా వుంటేనే బ్రతుకు. ఎదుటివాడి ఇంద్రియజ్ఞానాన్ని వీలున్నంతమేరకూ బోల్తా కొట్టించగలిగినవాడిదే ప్రపంచం. ప్రయత్నించని దోషాన్ని ఆచార్లు కంట గట్టడం న్యాయం కాదు. వంచించే పద్ధతులు తెలియక పోవడమే అతడి లోపం. ఆచార్లు నానా అంగళ్ళు నడిపి నష్టపడ్డాడు. గంపలో జోరుగుండ లమ్మి చూచాడు. ఒకటి రెండేళ్లు వీధిబడి గూడా చెప్పాడు. కానీ కడుపు చించుకున్నప్పటికీ గారడీ విద్యే ననుకునే కలికాలంలో ఆచార్లు నిజాయితీ కెక్కడా పరిగణన లేకపోయింది. బధిరత్వం - భగవంతుడు చూచిన చిన్న చూపు — దాని మూలంగా అతనికి ప్రతిచోటా అవహేళనే లభ్యమైంది.

తెలివిమీరిన లోకంలో బ్రతుకలేక దూరంగా, మరీ దూరంగా పారిపోదలచుకున్నాడు ఆచార్లు. కానీ తన కాళ్ళకున్న బంధం? ఆ బంధాన్ని ఎలా వదిలించుకోగలడు ఆచార్లు? పురుడు తీరకముందే తల్లి చనిపోగా తన చేతులమీదుగా పెంచి పెద్ద చేసిన కనకాన్ని తన రక్తంలో రక్తాన్ని, తన ప్రాణంలో ప్రాణాన్ని ఎలా వదిలిపెట్టగలడు ఆచార్లు?

ప్రపంచం వేరు. ఆచార్లు వేరు. కానీ ఈ రెండింటికీ ఓ లంకె వుంది. ఆ లంకె పేరే కనకం.

కనకం చిన్నప్పుడు బొద్దుగా, ముద్దుగా రామగుమ్మడిపండులా వుండేది. ఆ పిల్ల పెదవి కదిపితే 'నాన్నా' అని పిలిచినట్టే తోచి ఆచార్లు హృదయంలో ఆనందం వుయ్యాలలూగేది. కానీ దురదృష్టం ఎప్పుడెప్పుడు ఎక్కడెక్కడ ఏయే విధంగా పొంచి చూడగలదో ఎవరు చెప్పగలరు! అమ్మాయి అతణ్ణి 'నాన్నా' అని పిలవలేకనే పోయింది.

కనకానికి నోరు లేదు – కనకం మూగది!

ఈ సరికొత్త భగవల్లీలకుగూడా ఓ అర్థం కనిపించింది. తనకు మాటలు వినిపించవు. అంచేతనే భగవంతుడామెకు నోరు లేకుండా చేశాడు. అవును. అంతేననుకున్నాడు ఆచార్లు.

కనకం పావడా కట్టి, ఓణీ వేసింది. ఆ వేషంలో పూల రెమ్మలా, కుందనపు బొమ్మలా వుండేది కనకం. తనకు వయసొస్తోందన్న పరిజ్ఞానమే లేని అమాయకత్వం తొణికిసలాడే కనకం కళ్ళు నిరాకారమూ, నిర్వికారమూ అయిన పరతత్వ స్వరూపానికి ప్రతీకాలుగా భాసించేవి. రోజుకొక రకంగా సింగారించి, కనకానికి రూపురేఖలు దిద్దడంలో కాలపురుషుడు తన గడుసుదనాన్ని వ్యక్తం చేయడంమాత్రమే గాదు, ఆచార్లు ప్రయోజకత్వానికి గూడా పరీక్ష పెట్టాడు. ఆ పరీక్షాపత్రంలో ముఖ్యమైన ప్రశ్నలు రెండు. ఒకటి: ఈడొచ్చిన అమ్మాయికి ఎంతకాలం పెళ్ళి చేయకుండా వుండడానికి వీలవుతుంది? రెండో ప్రశ్నలో మళ్ళీ రెండు విభాగాలు. (ఎ) కట్నాలివ్వలేని మామగారికి ఎలాంటి జామాత లభ్యమౌతాడు? (బి) మనసునూ, హృదయాన్నీ ఖాళీ చేసి మాటలతోనే సమస్త వ్యవహారాలనూ సాగించుకపోతున్న వర్తమాన కాలంలో నోరులేని అమ్మాయికి మగడు దొరకడం సంభవమా? అసంభవమా? (సంభవమే ననుకున్నట్టయితే అతడి గుణగణాలెలాంటివి గావచ్చునో సంగ్రహంగా వివరించుమనది.)

ఈ పరీక్షలో ఆచార్లు కృతార్థుడయ్యాడని గానీ, లేదనిగానీ తేల్చి చెప్పడం కష్టం. ఆపరేషన్ విజయవంతమైనా రోగికట్టె కడతేరిపోయినట్టుగా కనకం మెడకు గుదిబండలాంటి మొగుడు మాత్రం దాపురించాడు.

తనకు దొరికింది మట్టిగుర్రమని ఆచార్లుకు తెలుసు దానిపైన కూర్చోబెట్టి తన కుమార్తెను గోదావరిలోకి వదలిపెట్టలేడు. అతని దొకటే కృతనిశ్చయం. ఆమె నీడలా తనను వెన్నంటివుంటుంది. తను తింటే తింటుంది. లేకుంటే పస్తుంటుంది.

కానీ ఆచార్లకు స్వామిపుణ్యాన పట్టెడన్నానికి మాత్రం కరువొచ్చిపడలేదు. తండ్రీ కూతుళ్ళిద్దరూ తెల్లవారక మునుపే లేచి గుట్టదిగివెళ్ళి రామినాయుడుగారి దిగుడు బావిలో స్నానం చేసి చెరొక బిందెడు నీళ్ళు తెచ్చుకునేవారు. కనకం గుడిలో చెత్త వూడ్చి యింత బియ్యంవుడికించి ఏ చిత్రాన్నమో, ఏ చక్కెర పొంగలో తయారుచేసేది. స్వామికి నైవేద్యమిచ్చి ఆచార్లు పూజ ముగించేసరికి సూర్యుడు చండప్రచండంగా నడిమింటికి వచ్చేసేవాడు...కనకం మాట్లాడదు. అచార్లు మాట్లాడడు. స్వామి మాట్లాడడు. ఒకటి రెండు మాసాలక్రిందటివరకూ దేవళం మిట్ట ఓ చిన్న మౌనప్రపంచం. లేదంటే ఆచార్లుగారి పూజాశ్లోకాలు, పక్షుల కలకూజితాలు, అడివి మేకాల అరుపులు ఆ ప్రశాంతతను చీల్చుకుంటూ వెలువడి మళ్ళీ అలాగే కరిగిపోయేవి.

పది పదిహేను రోజులనుంచీ ఆ పూజా శ్లోకాలను గూడా పఠించడం లేదు ఆచార్లు. గుడితలుపులతోబాటు అతడినోటికిగూడా తాళంపడింది. స్వామికి పూజలేదు. ప్రసాదంలేదు. ఇచ్ఛామాత్రంతో ఈరేడు భువనాలను సృజించిన లోకేశ్వరుడు వట్టి కర్పూరహారతికిగూడా నోచుకోకపోయాడు! క్షణక్షణానికీ ఉద్ధృతమై తనను లోలోపలినుంచీ కాల్చివేస్తున్న ఈ మనోవేదన పైనకొస్తా ఉపశమనంగా అప్పటికప్పుడే నిద్రాదేవత కౌగిట్లోకి జారుకున్న ఆచార్లును రాఘవులు తట్టి తట్టి లేపికూర్చోబెట్టాడు.

మిరపగింజలకోసం ఇంటిలోపలికివెళ్ళిన ఆచార్లు అయిదారు నిమిషాలకుగానీ తిరిగి రాలేకపోయాడు. వచ్చినప్పుడు అతడిముఖంలో సుళ్ళుతిరుగుతున్న ఆందో

శనను సుబ్బయ్యగానీ, రాఘవులుగానీ పసిగట్టలేక పోయారు. లోపలిగదిలో అమ్మాయిమాత్రం నిద్ర పోతోంది. అల్లుడు మంచంపైన లేడు. ఆచార్లు పెరట్లో చూచాడు. పెరటితలుపుకు వేసిన గడియ వేసి నట్టేవుంది. ఐతే వీడు ముందువాకిలిగుండానే బయటికి వెళ్ళిపోయాడన్న మాట! ఎక్కడికి వెళ్ళినట్టు? ఈ అర్ధరాత్రి సమయాన వీడికింత జరూరుగా బయటికి వెళ్ళవలసిన అవసరమేమిటి? ... పోలీసులు వెళ్లి పోయారు. కానీ ఆచార్లుకు ఆలోచనలు ఎడతెగడం లేదు. కనకానికి పెళ్లయిఏడెనిమిదేళ్ళు కావస్తున్నాయి. ఈ ఏడెనిమి దేళ్ళలో అతగాడు పట్టుమని ఏడెనిమిది మాసాలైనా ఇంటిపట్టున పడివున్నపాపాన పోలేదు. ఎప్పుడో వచ్చేవాడు, వచ్చి పది పదిహేనురోజులుండే వాడు. మళ్ళీ ఎలావచ్చాడో అలాగే మాయమై పోయేవాడు. అతడితోబాటు పాత్రసామగ్రీ, నగానట్రా లాంటివిగూడా మాయమైపోవడంకద్దు! మాయమైన ప్రతిసారీ ఈవెధవను ఇంట్లో చేరనివ్వడంకన్నా మరొక తెలివితక్కువపని లేదనుకునేవాడు ఆచార్లు. కానీ మమకారం దొడ్డది.ఎలాగూ తనకు మగబిడ్డలు లేకపోయారు. కనకానికైనా కడుపు పండి ఓ మగ నిసుగు కలిగితే...

ఆకసంవైపుచూస్తూ పడుకున్న ఆచార్లుకళ్ళల్లో కన్నీళ్ళు గిర్రున తిరిగాయి.

'బాగున్నదయా నీ మాయ, బహుబాగున్నదయా నీ మాయ'— అమాంతంగా ముంచుకొచ్చిన జలుబు గూడా పాడే నోటికి ప్రతిబంధకం కాలేకపోయిందేమో! కోనేటి నీటిలో కొరమీను వలయాలు తిరిగినట్టుగా రాఘవుల పాట దేవళం మిట్టపైని రోదసిలో అలలు అలలుగా కదలిపోతోంది.

## 2

వెన్నెల బయలునుంచి మ్రిచేను పాళయానికి వెళ్ళే కంకర బాటలో పన్నెండో మైలురాయిదగ్గర నిలబడి పడమటివైపుగా చూస్తే, మోచేయి తలగడగా శయనించిన మహాపురుషుని ఆకారంలా కాటమరాజు కొండలు కనిపిస్తాయి. కొండలపైన దట్టంగా పెరిగిన అరణ్యం. ఓమూలగా మల్లమ్మకోన. అడవులకు సరిహద్దు గీతలా పరుగెడుతున్న బాట. ఆ బాటకూ, కోనకూ మధ్య ఓ మట్టి గుట్ట. అదే దేవళం మిట్ట.

దేవళం మిట్టపైన వెలిసిన దేవుణ్ణిగురించి ఓ స్థల పురాణం వుంది. దేశం కుంఫిణీ దొరల ఏలుబడి క్రిందికి వస్తూ వస్తూ వున్న రోజుల్లో జరిగిన కథ. మ్రిచేను పాళియం పాళెగారైన ముద్దు వేంకటనరసింహనాయని వారొకసారి స్వయంగా దగ్గరుండి సుర పొన్నచెట్లు నాటడంకోసం 'నంద వనం' లో పాదులు త్రవ్విస్తున్నారు. నడుముదాకా పైకెత్తిన గడ్డపారను క్రిందికి దిగవేయగానే ఖంగుమన్న శబ్దం ఒకటి గింగుర్లు తిరిగి పోతూ వచ్చి కర్ణకుహరాల్లో పడింది. తోటకాపరి నాగుమయ్య గడ్డపార నలాగే వదిలిపెట్టి చేతులతోనే మట్టి పెకలించాడు. మొదట తల మాత్రమే కనిపించింది. మట్టి తీసినకొద్దీ విగ్రహం పూర్తిగా బయట పడింది.

దాదాపు రెండడుగుల ఎత్తు. ఏండ్లుగా పూండ్లుగా మట్టిలో పడి వుండి వికృతమై పోల్చుకోడానికి వీల్లేనంతగా మారిపోయిన బాహ్య స్వరూపం. పంచలోహాల మిశ్రమంలో తయారుచేసిన ఆ విగ్రహం ముద్దు వేంకట నరసింహనాయని వారికి ఏమంత ఆనందాన్ని చేకూర్చలేకపోయింది. లంకె బిందెల్లో నిధి నిక్షేపాలు పైకి లేవగలవని ఎదురుచూస్తే, అయ్యవారిని చేయబోతే కోతైనట్టు, ఈ పురాతన విగ్రహం ఒకటి బయట పడినందుకు ఆయన ముఖం చిన్నబోయింది గూడా!

దాన్ని తీసుకెళ్ళి దేవిడిలో ఓమారు మూలగదిలో పడవేయించి నాయనివారు అంతటితో ఆవిషయాన్ని మరచిపోవడానికి ప్రయత్నించారు.

ఆ యేడు వరుణదేవుడు బిర్ర బిగుసుకున్నాడు. ఆకాశాన మబ్బులేమో కొండలు కొండలుగా కదిలేవి. ఒక్క నిమిషంలో దిశాంచలాలవరకూ నల్లటిగుడారం తయారయ్యేది. అంతలో సుడిగాలి రివ్వురివ్వున వీచి మేఘాలు శకలాలై చెల్లాచెదరై పోయేవి.

ఒకటి కాదు. రెండు కాదు. నిండుగా మూడేండ్ల పొడుగునా యిలాగే జరిగింది. ఎండి బీటలు వారిన పొలాల్లో, నాలుగు మట్లు త్రవ్వినా నీటి చుక్క కనిపించని ఏటి యిసుకతిన్నెల్లో, అట్టడుగున జిల్లేడు చెట్లు మొలిచిన కబిలబావుల్లో క్షామదేవత వికట తాండవం సలిపింది. పైకప్పును చదలు తినివేసిన పూరిగుడిసెల్లో, కడుపులు లోపలికిపోయి, బొక్క రొమ్ములు పైకిలేచిన నిరుపేదల గుండెల్లో, పసిపాప కంచంలో వేడి నీళ్లు పోసి ముఖం మరోవైపుకు త్రిప్పుకుని కన్నీరు నించిన కన్నతల్లి కళ్ళల్లో యినుపగజ్జల తల్లి వికటాట్టహాసం చేసింది. హేమంతం లోకాన్ని

గడగడలాడించింది. శిశిరం సూదుల్లాంటి తన వెయ్యి నాలుకలతో ఒంటినిండా బట్టలేనివాళ్ళని పరామర్శించింది. వసంతుడు మేకతోలు కప్పుకున్న గ్రీష్ముడిలా వేంచేశాడు. ఇక గ్రీష్మరాజు సంగతి సరేసరి! ఆయన నిప్పులే వుమిశాడు.

ముద్దువెంకటనరసింహనాయనివారికి మతిపోయినంతపనైంది. ఆయనకు తిండి సయించడంలేదు. నిద్రపట్టడం లేదు. మహిడీపైన నిల్చుని గరికపోచ గూడా మాడిపోతున్న పొలాలవైపు, ఆకులన్నీ డుల్లిపోయి మోడు వారిపోతున్న చెట్లవైపు చూస్తూ ఆయన ఖిన్నులైపోయారు.

కార్చిచ్చులాంటి కాటకం ఇలా వీరవిహారం చేస్తున్న రోజుల్లో ఒకనాటిరాత్రి నాయనివారికలలో ఓ దివ్యపురుషుడు కనిపించాడు. ఆజానుబాహుడు, చతుర్భుజుడు, చక్రహస్తుడు, పీతాంబరుడు, నీలమేఘశ్యాముడూ అయిన ఆదివ్యపురుషుడు సాష్టాంగపడి సభక్తికంగా నమస్కరించిన నాయనివారిపైకి మందహాస జ్యోత్స్నలుబరపి "అయ్యా నరసింహందొరా తరతరాలుగా మీవంశానికిఇలవేల్పును నేను! కానీఏంలాభం నా అంతట నేనై నీకు దొరకినా నువ్వు గుర్తించావుగావు! నీ దేవిడీకి ఈశాన్య దిగ్భాగంలో క్రోసుదూరాన ఓ మట్టిగుట్ట వుంది. ఆ గుట్టపైన నాకు ఓ గుడికట్టించు. ఏటేటా ఉత్సవాలు జరిపించు. నెలకు మూడు వానలు కురుస్తాయి. ముంగారుపంటల సింగారంతో కేదారాలు శోభిస్తాయి. ప్రజలు ఈతి బాధలులేకుండా సుఖిస్తారు. నీకు శుభం కలుగుతుంది..." అన్నాడు.

నాయనివారా ఆనతిని శిరసావహించారు. 'నందవనం'లో దొరికిన ప్రతిమను బయటికి తీయించి, బంగారుపూత పూయించారు. గుట్టపైన గుడికట్టించి, ధ్వజస్తంభం నిలిపి, కుంభాభిషేకం సలిపి బ్రహ్మాండంగా ఉత్సవం జరిపించారు.

అంతటితో మూడేళ్ళ కరువు ముదమారిపోగా, ఏడు రోజుల జడిపట్టి కుండపోతగా వాన కురిసి వాపీకూప తటాకాలు కొత్తనీళ్ళతో దబకలెత్తిపోయాయని చెబుతుంది స్థలపురాణం.

ఏమిటో మరి! నరునిది అల్పాయువు కావడం వల్లనైతేనేమి, తరులూ, గిరులూ మాట్లాడలేకపోవడం వల్లనైతేనేమి ఆ గాథలోని నిజానిజాలీపాటివని తేల్చి చెప్పడం కష్టం! ప్రస్తుత కథాకాలంనాటికి మఱిచేను పాళియంలో ఆ దేవిడీలూ లేవు, ఆ రాచరికాలు లేవు. వాటి శిథిలావశేషాలుగా మొండిగోడలుమాత్రం కనిపిస్తాయి.

కానీ గుట్టపైని వరదరాజస్వామికి మాత్రం పూటకింతనైవేద్యానికి లోటులేకుండా కాలం గడచిపోతూ వచ్చింది. గుడికెంతో కొంత మాన్యం వుండేది. వచ్చేరాబడి ధాన్యరూపంగా వచ్చేది. గుడిలోపలి దేవుడుగానీ, ఆ దేవుణ్ణి నమ్ముకున్న పూజారిగానీ దినవెచ్చంకోసం మరొకరిని ఆశ్రయించవలసిన అవసరం లేకుండా రోజులు దొర్లిపోయేవి.

ఉన్నవారున్నట్టుండలేక పొడుపు కథలు వేయడం, వేసిన తర్వాత వాటిని విప్పడానికి ప్రయత్నించడం—తిండిలేకపోయినా మానె మానవులకు ఈ ఆరితీరని జిజ్ఞాస ఒకటి లేకపోతే పూట గడిచేటట్టు తోచదు. సాక్షిమాత్రుడుగా జగన్నాటకాన్ని అవలోకిస్తూ నిర్లిప్తుడై, నిశ్చలుడై గుడిలో కూర్చున్న వరదరాజస్వామికి అలాగే వుండిపోనిచ్చి ఉంటే బాగుండేది. ఉండనిచ్చారు గాదు. చెప్పుకోదగిన విశేషం అదే మరి!

దేవళం మిట్టకటువైపున కమ్మవారి ఠెంకి కామసముద్రం. ఇటువైపున కాపువారి నెలవు వేమవరం. కామసముద్రానికీ వేమవరానికీ మధ్య పచ్చిగడ్డి మొలవదు. ఒకవేళ మొలిచినా భగ్గుమని మండిపోయేటంతగా కక్షలూ, కార్పణ్యాలూ రగులుకుంటూ వచ్చాయి. గుణింతంలో మొదటి అక్షరం 'క' తరువాతి అక్షరం 'కా' కాబట్టి తమదే ప్రథమస్థానమనే వాళ్ళు కమ్మవాళ్ళు. 'క' హ్రస్వం. 'కా' దీర్ఘం. కనుక తమదే అగ్రస్థానమనే వాళ్ళు కాపులు. ఈ రావణాసురుడి కాష్ఠం నిరంతరాయంగా ప్రజ్వరిల్లిపోతుండడానికి ఎప్పటికప్పుడు క్రొత్త క్రొత్త ముడిసరుకు కావలిసి వచ్చేది.

దీక్షగా ఆలోచింపసాగిన వేమవరం మణేగారు వీరారెడ్డిగారికి హఠాత్తుగా ఓ విషయం స్ఫురించింది. ఎందుకోగానీ పది పదిహేనేళ్ళనుంచీ వరదరాజస్వామిని తలిచే నాథుడు లేడు. ఉత్సవాలు జరగడం లేదు. నిత్యపూజలు జరుగుతున్నాయో లేదో తనకు తెలియదు. వీరారెడ్డిగారు వెంటనే తమకు కావలిసిన వారితో ఓ సదస్సు ఏర్పాటు చేశారు. ప్రతినిధులను ఎన్నిక చేశారు. ఆ ప్రతినిధులు వీరారెడ్డిగారిని ఏక

గ్రీవంగా అధ్యక్షుడుగా ఎన్నుకున్నారు. వరదరాజస్వామి దేవస్థాన నిర్వహణ సంఘాధ్యక్షులుగా వీరారెడ్డిగారు గుడిమణియాన్ని తమ గుప్పిట్లోకి తీసుకున్నారు.

ఈ సవాలుకు ఎదురు సవాలు విసరడంతో కామసముద్రం పిన పెద్ద రామినాయుడుగారు ఒక్క నిమిషం కూడా వెనుకాడలేదు. ఆయన మ్రిచేను పాళయం దొరలవంశం యిలాకాలో చిట్టచివరివాడి నొకణ్ణి వెదికి పట్టి అతడిచేత దేవాలయ ధర్మకర్తృత్వాన్ని తమ పేర వ్రాయించుకున్నారు. వారి రిజిష్టరు చేయించుకున్న మరునాడే వీరారెడ్డిగారికి వకీలు ద్వారా నోటీసు వెళ్ళింది. దేవాలయం పైన యాజమాన్యం తనది. మరొకడెక్కడ తల చూపించటానికి వీల్లేదు. ఆలా తల చూపిస్తే ఆ తరువాత ఏర్పడగల పరిణామాలకు తను బాధ్యుడు కాదు!

గుడిచుట్టూ ముళ్ళపొదలు బలిసి, ఓ చిట్టడివి తయారై పోతుండేది. ఆ పొదలను ఛేదించి పరిసరాలను శుభ్రం చేయవలసిన అవసరం నోటీసు అందిన మరునాడు గానీ మనసుకు తట్టలేదు వీరారెడ్డిగారికి! కత్తులూ గొడ్డళ్ళూ. దుడ్డుకర్రలూలాంటి వృక్షవిచ్ఛేదన సామగ్రిని చేతికిచ్చి ఆయన జట్టీలలాంటి వాళ్ళను పాతిక మందిని దేవళం మిట్టపైకి సాగనంపాడు.

రెడ్డిగారి మనుషులు గమ్యస్థానం చేరుకున్న తర్వాత ఒకటి రెండు గడియల్లోనే అక్కడ నాయుడిగారి సైన్యం కూడా ప్రత్యక్షమైంది.

రక్తంలో జితించిపోయిన విద్వేషంతో బుసలు కొడుతూ, ప్రాణాలకు తెగించిన తెంపరితనంతో పెడబొబ్బలు పెడుతూ మానవులు మృత్యువుతో చెలగాటానికి తలపడే సంరంభం ఏలాంటిది? విచ్చుకత్తులు చేతబట్టి 'కిల్లల్లో' అని కిలారిస్తూ వాళ్ళు వేసిన కేకలకు కాటమరాజు కొండలు పునాదులనుంచీ గ్రక్కదలిపోయినట్టుగా ప్రతిధ్వనించాయి. దేవళం మిట్ట కేంద్రంగా మూడు మైళ్ళ పరిధిలో మగవాడు లేడు. రక్తదాహంతో వచ్చినవాళ్లు కొందరు, బాహుకండూతితో వచ్చినవాళ్లు కొందరు, పురికొల్పి, ప్రోత్సహించి గెలిస్తే విజయోత్సాహంలోపాలు పంచుకోడానికి, లేదా వీరస్వర్గానికి సాగనంపడానికి వచ్చిన వాళ్ళు కొందరు. పాదఘట్టనల మూలంగా దట్టంగా పైకి లేచిన ఎర్రటి దుమ్ములోనుంచి ఒక్కుమ్మడిగా ఆర్తనాదాలు ఆక్రందనలూ చెలరేగేదాకా ఆ అలజడి అలాగే కొనసాగింది. అప్పటికే అయిదారుగురి ప్రాణవాయువులు అనంతాకాశంలో కలిసిపోయాయి. కొందరు వికలాంగులు కాగా, మరికొందరు క్షతగాత్రులయ్యారు. జరిగిన 'రక్తగావు'తో మృత్యుదేవత ఆకలి కాస్త తగ్గుముఖం పట్టినందుకు సూచనగా యిరుపక్షాలవారూ ఎక్కడివారక్కడే ఆగి పదడుగులు వెనక్కి వేశారు. స్కంధావారాల్లాంటి చెట్లనీడల్లో విశ్రమించి ఎవరైతే దేవాలయాన్ని సమీపిస్తాడో, వాడితల భూమిపైన దొర్లుతుందంటూ క్రొత్తగా ఓ నినాదాన్ని ప్రారంభించారు.

ఈ ఉద్రిక్త వాతావరణాన్ని ఎలా పసిగట్టారో గానీ ప్రభుత్వాధికారులు కార్లలో జీపుల్లో పరతెంచి వచ్చేశారు. వారి వెంట నాలుగు లారీల రిజర్వు పటాళం దిగింది. అదిలించి బెదిరించి ప్రొద్దుగూటిలో పడేసరికి ఆ ప్రదేశాన్ని నిర్జనం చేయగలిగారు పోలీసులు. కలెక్టరుగారు ఉభయవర్గాల నాయకులను ఒకచోట సమావేశపరచి వివాదపరిష్కారానికి ఓ మార్గాన్ని నిర్దేశించారు. దేవాలయం పైన యాజమాన్యం ఎవరిదో న్యాయస్థానం నిర్ణయిస్తుంది. కొంతకాలంపాటు దేవళం మిట్టపైన మనుషులు నడయాడడానికి వీల్లేకుండా నూటనలభై నాలుగో సెక్షను అమల్లో వుంటుంది. దేవాలయ సింహద్వారానికి నాయుడుగారిదొకటీ, రెడ్డిగారిదొకటీ వెరశి రెండు తాళాలు వ్రేలాడుతుంటాయి. పెళ్ళాం మెడలో తాళిబొట్టులా, ఆ రెండు తాళాలకూ ప్రభుత్వంవారి సీలు వేయబడుతుంది.

## 3

గంపక్రిందటి కోడిపుంజు రెక్కలు తపతప కొట్టుకుని 'కొక్కరొకో' అంటూ కూసిన తొలికూత మల్లమ్మ కోనలో ప్రతిధ్వనించింది. ఎండ్రకాయలు వెదుక్కుంటూ ఏటివాలు ననుసరించి వెళ్ళి అడ్డదారి వెంట తిరిగొస్తున్న గుంటనక్కలు తెల్లటి దుప్పటి కప్పుకుని ముద్దలా కూర్చున్న సుబ్బయ్యను చూచి బెదరి చెదరిపోయాయి. నిద్రలేచిన ప్రకృతి ఒళ్ళువిరిచి ఆవులిస్తున్నట్టుగా అడవులపైనించీ ఈదరగాలి ప్రారంభమైంది.

“ఐతే నీకు రాత్రి వినిపించిందేమైవుంటుందోయ్ సుబ్బయ్యా?” ప్రశ్నించిన రంగస్వామికి మల్లే అతడి ప్రశ్న కూడా చలికి గడగడ వడకిపోతోంది.

"నా సంగతి నీకు తెలుసుగా రంగయ్య మామా! నేను చీటికీమాటికీ అనుమానపడేవాణ్ణిగాను. ఏమిటో వినిపించింది. అంత మట్టుకూ నిజం!"

"ఏమిటో వినిపించిందని యిక్కడ చెట్టు క్రింద మీనమేషాలు లెక్కబెడ్తూ కూర్చోకపోతే ఒక్కసారి లోపలికి వెళ్లి చూచి రాగూడదటయ్యా మరి!"

ఎలాగైనా రంగసామి పెద్దవాడు. ఉద్యోగ జీవితంలో ఢక్కామొక్కీలు తిని రాటుదేలిన మనిషి. ఆతడి మాటపైన గురివుంచడంవల్ల కూడి వచ్చేది వున్నా లేకపోయినా చెడిపోయేది మాత్రంవుండదు. సుబ్బయ్య తలకు మఫ్లరు చుట్టుకుంటూ లేచి నిల్చున్నాడు.

"ఉండవోయ్ సుబ్బయ్యా! నేనూ వస్తానుండు..." అంటూ రంగసామి గూడా కంబళి ముదర చుట్టుకుంటూ పైకి లేచాడు.

దేవళం వెనుక కూలిపోయి చెల్లాచెదరుగా పడి వున్న ప్రహరీ గోడ రాళ్ళు మంచుకొండ కొమ్మునుంచి వూడుపడిన బెడ్డల్లా నీరోడుతున్నాయి. గర్భగృహం చుట్టూరా విరబూసిన పొగడచెట్ల క్రింద రాలి వాడి మంచులో తడిసిన పువ్వులు ఒక విధమైన సువాసనలు వెదజల్లుతూ పరిసర వాతావరణాన్ని మైకంతో నింపేస్తున్నాయి. తరచుగా జనం నడయాడడానికి నోచుకోని విశాలమైన ఖాళీజాగాలో ఏపుగా పెరిగిపోతున్న పచ్చిక పైన హిమబిందువులు ఆణిముత్యాల్లా తళతళలాడుతున్నాయి.

చరచరా ముందుకుసాగి మండపంలో అడుగిడిన సుబ్బయ్య ఒకటి రెండు క్షణాలపాటు కొయ్యబారిపోయాడు. అతడి కళ్ళల్లో భయం తెరలు తెరలుగా కదలాడింది.

"కొంపమునిగినట్టేనయ్యా రంగయ్యమామా! నా అనుమానం వృథాగా పోలేదు. త్వరగా రావయ్యా బాబూ, రా మరి!" అంటూ అతడు బెంబేలుపడిపోసాగాడు.

సుబ్బయ్య కంగారు పడడానికి తగినంత కారణం లేకపోలేదు. గర్భగృహం తలుపులు ఓ మనిషి ప్రవేశించడానికి వీలుగా తెరచి వున్నాయి. ఊడిపోయిన తాళం తాళం చెవితో సహా గొళ్ళానికి వ్రేలాడుతోంది.

"మనం అనుకున్నంతా అయింది సుబ్బయ్యా! అరిచి ఆర్భాటం చేశావు గనుక వాడికి నింపాదిగా తలుపులు మూసి తాళం వేసుకుని వెళ్లే అవకాశం లేకపోయింది. కానీ యింతదూరం వచ్చినవాడు వట్టి చేతులతో మాత్రం వెళ్లి వుండడు. ఆదమరిచి నిద్రపోతున్నాను గాబట్టి సరిపోయిందిగానీ లేకుంటే వాడి భరతం పట్టివుండేవాణ్ణి! అయినా యిప్పుడు మించిపోయిందేమీ లేదు. నా అనుమానాలు నాకున్నాయి. ఆమిడతను ఈ పిడికిట్లోకి చిక్కించుకోకపోతే నా పేరు రంగసామి కాదు..."

రంగసామి భ్రుకుటి కుంచించాడు. కనుబొమలు ఎగురవేశాడు. చివరకు తల పంకిస్తూ మండపంలో పచార్లు చేయసాగాడు.

"నీ ఆలోచనేమిటో కాస్తా వివరంగా చెప్పకూడదా రంగయ్య మామా!" ప్రాధేయపడ్డాడు సుబ్బయ్య.

రంగసామి హెచ్చరిస్తున్నట్టుగా సుబ్బయ్య భుజంపైన చేయవేశాడు. "మాడు సుబ్బయ్యా! పిల్లకాకికి వుండేలు దెబ్బ తెలియదు. ఇక్కడీ తలుపులు ఈలాగే తెరిచి వున్నట్టయితే మన గొంతుక అడకత్తెరలో తగులుకుంటుంది. వేసేయ్, తలుపులు వేసేయ్. మొదట తాళం బిగించు..."

సుబ్బయ్య తలుపులు చేరవేసి తాళం బిగించాడు.

## 4

భళ్ళున తెల్లవారడమేగాదు, ఆచార్లు నిద్రలేచేసరికి నాలుగు బారల ప్రొద్దెక్కింది. అప్పటికైనా వేడి వేడిగా రెండు కన్నీటి చుక్కలు నుదుట రాలడంతో అతడు కళ్లు తెరిచాడు. దాపున కూర్చుని కనకం కంట నీరు పెట్టుకుంటోంది.

"ఇదేమిటి తల్లీ! పండగపూట కంట నీరుపెట్టుకోడమే! తప్పు కాదూ?" పై గుడ్డతో కన్నీళ్లు తుడిచివేస్తూ అన్నాడు ఆచార్లు. "అయినా అత డిలా వెళ్ళిపోవడమూ, తిరిగి రావడం కూడా మామూలే కదూ! ఈ మాత్రానికే ఏడుస్తూ కూచుంటావా? తల దిరిగి కవళం నోటిదగ్గరకు రాకుండా మరెక్కడికి పోతుంది? వెళ్ళనీయమ్మా వెళ్ళు. వెళ్ళి పోయిరా జెయ్..."

తండ్రి మాట్లాడుతున్నంతసేపూ కన్నార్పకుండా అతడివైపు చూస్తూ కూర్చుంది కనకం. ఆ తరువాత తన విచారం అందుకు కాదన్నట్టు తల అడ్డంగా త్రిప్పుతూ ఆచార్లు ఒంటిపైన చేయివేసి జబ్బేమిటన్నట్లు చూపులతోనే ప్రశ్నించింది.

"అబ్బే, నాకేమమ్మా! నిక్షేపంగా వున్నాను. లేచి చేసేది మాత్ర మేముందని బద్ధకంగా పడివుండి పోయాను. మరేం భయంలేదులే" ఆచార్లు కంఠం గద్గదికమైపోయింది.

కనకం లోపలికి వెళ్లిపోయింది. ఆచార్లు మంచాన్ని గోడకానించి అరుగుపైకివచ్చి నిల్చున్నాడు. కరవాలపు టంచులా నిగనిగ లాడిపోతున్న నీరెండలో మూసిన తలుపులతో నిద్రమత్తులో జోగుతున్నట్టున్న దేవాలయం కనిపించగానే ఆచార్లుకు ఏడుపొచ్చింది. కొండంత పండుగ, వైకుంఠ ఏకాదశి. గుడిముంగిట కళ్లాపులేదు. ముగ్గులులేవు. తోరణాలులేవు. గుడిలోపల దీపం లేదు. ధూపారాధనలేదు. ఘంటారావం లేదు. దేవాలయాన్నే గాదు, ఈ దేశాన్నే ఏదో మూదేవి ఆవహించినట్టుంది!......కడుపులో ఎవరో చెయ్యివేసి కలచినట్లయి ఆచార్లు అరుగుపైన కూలబడి పోయాడు.

ఆచార్లు దృష్టిలో వరదరాజస్వామి సుఖదుఃఖాలకు అతీతుడుగాదు. ఆయనకూ ఆకలిదప్పులున్నాయి. కానీ ఆ వెర్రిబాగులవాడు నోరుతెరిచి అడుగలేడు. అడుగకపోతే మాత్రం? ఆయన్ని యింతగా నిరాదరణ చేస్తారా ఈ మానవులు!...ఉక్రోషంతో ఆచార్లు విలవిలలాడి పోయాడు.

శీతాకాలపు టెండ పేదవాడి కోపంలా కాసేపు కరకరలాడి అంతలో చల్లబడిపోయింది. వంటపనులన్నీ ముగించి కనకం నాలుగైదుసార్లు వసారాలోకి వచ్చి చూచింది. ఆచార్లులో కదలికలేదు. అతడి కళ్ళు జపాకుసుమాల్లా మండుతున్నాయి. ముడతలు పడిన ముఖంలో ముడత ముడతకూ మధ్య కదిలిపోతున్న ఏదో అవ్యక్తమైన ఆవేశం తాకిడికి అతడి ఉత్తమాంగం చలించిపోతోంది.

ప్రొద్దు వాటారగానే ఆచార్లు గుట్టదిగి క్రిందికి వెళ్లాడు. బావిలో స్నానంచేసి బాగా చీకటిపడిన తర్వాత యింటికి తిరిగివచ్చాడు. కనకం దీపం చిన్నది చేసి తండ్రికోసం వేచి చూస్తూ అలాగే నేలకొరిగి నిద్రపోతోంది. ఆచార్లు ఆమెను లేపదలుచుకోలేదు. స్వయంగా తనే పొయి ముట్టించి పాత్రలో ఎసరు పెట్టాడు. పాకం పూర్తయ్యేసరికి మలిజాము గూడా పూర్తి కావచ్చింది. ఆచార్లు తాళం చెవికోసం వెదుక సాగాడు. గర్భగుడికి రెండు తాళపు చెవులున్నాయి. వాటిల్లో ఒకటి గుడి మూతబడినప్పటినుంచీ నడవ గదిలో గూట్లో పడివుండగా ఆచార్లు లెక్కలేనన్నిసార్లు చూచాడు. కానీ సమయానికది ఎక్కడ వెదికినా కనిపించింది కాదు. విసుగెత్తి ఆచార్లు పెట్టెలోనుంచీ రెండో తాళం చెవి పైకి తీశాడు. పొంగలి, పూజాద్రవ్యాలు పళ్లెరంలో అమర్చుకుని పెరటి గుమ్మంగుండా బయటికి వచ్చాడు. మేఘాచ్ఛన్నమైన ఆకాశం క్రింద భూతాలు కొలువుదీర్చినట్టున్న పొదల మధ్యనుంచీ త్రోవ చూచుకుంటూ ముందుకు నడుస్తున్నాడు ఆచార్లు. అతడి పాదాలు గాలిలో తేలిపోతున్నాయి. నీరసంవల్ల శరీరం కృంగిపోతోంది. కానీ ప్రపంచానికి మారొడ్డి తను చేయబోతున్న పనిని గురించి తలచుకున్నకొద్దీ అతడి మనసులో ఆనందం పరవళ్ళు ద్రొక్కుతోంది.

శిథిలమైన ప్రాకారం దాటుకుని ఆచార్లు మంటపంలో ప్రవేశించాడు. పళ్లెరాన్ని క్రిందపెట్టి చప్పుడు కాకుండా తాళం తీశాడు. మెల్లగా లోపలికి వెళ్ళి తలుపులు మూసుకున్నాడు. అగ్గిపుల్లగీసి దివ్వె వెలిగించాడు.

తడిలేని ప్రమిదెలో ప్రత్తితో చేసిన పాతవత్తి చిరచిర లాడుతూ వెలిగింది. చీకటిని ఏమాత్రమూ జయించలేని ఆ గుడ్డి దీపం గాలి కదలాడని భూగృహం లాంటి ఆ గర్భగుడిలో కాలనాగు పడగపైన మెరుస్తున్న మాణిక్యంలా పొడగట్టి, అంతకంతకూ కొడిగట్టిపోసాగింది. ఐనా ఆచార్లు కది చిరపరిచితమైనచోటు. అతడి పూజకు చీకటి ఒక అడ్డంకిగా నిలువగలిగి వుండేది కాదు. బధిరత్వమొక్కటేగాదు ఆ క్షణాన ఆచార్లుకు అంధత్వం సంప్రాప్తించివుండినా పూజాదికాలు నిర్విఘ్నంగా నెరవేరి వుండేవి. కానీ వచ్చిన పని మరచిపోయాడు ఆచార్లు. చేష్టలు దక్కి ఎండు కట్టెలా కొయ్యబారిపోయాడు. దేవుడి ఎదుట నైవేద్య మివ్వడానికి వుపకరించే వెండి పళ్లెం కనిపించడంలేదు. తీర్థ కలశంలేదు. శఠగోపంలేదు. లేని వాటి సంగతలా వుండగా వున్నవి గూడా వాటి వాటి యథాస్థానాల్లో కన్పించడంలేదు. ఉద్ధరిణె, పంచపాత్రలాంటివి క్రిందపడి వున్నాయి. ముక్కాలిపీట తల్లక్రిందులైంది. ఆ పీటపైన వుండవలసిన యిత్తడి తబిల నాలుగైదు బారలదూరం దొర్లి ద్వారాని కల్లంత దూరంలో పడివుంది.

తలపైన పిడుగుపడి తన శరీరం చిద్రుపలుగా ప్రిదిలిపోతున్నట్టు భావించాడు ఆచార్లు. అతడి

ముఖాన స్వేదబిందువులు గుప్పుగుప్పునపొటమరించాయి. నిలువునా కంపించిపోతూ అతడు నిటారుగా నిల్చోలేక గోడపైకి ఒరిగిపోయాడు.

ఆరిపోవడానికి ముందుగా చావు తెలివి తెచ్చుకుని కొంచెం విజృంభించిన దీపకాంతిలో ఆచార్లుకు మరో దృశ్యం కనిపించింది. దేవుడి ఆభరణాలూ, పట్టు గుడ్డలూ భద్రం చేసివుంచే పాతకాలంనాటి కొయ్య పెట్టెను గూడా ఎవరో తెరిచేశారు. బట్టలన్నీ పెట్టెకు బయట చెల్లాచెదరుగా పడివున్నాయి.

దీపం ఆరిపోయింది.

ఆచార్లు అక్కడ నిల్చోలేకపోయాడు. గిరుక్కున ముందుకుసాగి ద్వారం దాకా పరుగెత్తి వచ్చాడు. వచ్చినదారివెంట తిన్నగా తిరిగి వెళ్లిపోయి వుండేవాడే ఆచార్లు. కానీ తలుపు తెరుచుకోలేదు. కవాటాని కావలి వైపున రంగస్వామి నవ్వుతున్న వెడ నవ్వు గూడా ఆచార్లుకు వినిపించడం లేదు !

## 5

ఒకటి రెండు ప్రశ్నలు గాదు. హోరు హోరున ప్రశ్నల వర్షం కురుస్తోంది. అన్నింటికీ నిరుత్తరుడే ఆచార్లు. లేదంటే అతడి దొకటే సంజాయిషీ—'లోకాని కంతా పండుగ. స్వామికి మాత్రం పట్టెడు నైవేద్యం లేకపోవడమేమిటి? రెండో కంటికి తెలియకుండా దేవుణ్ణి అర్చించి పోవాలనే వచ్చాను. పరమాత్ముడే సాక్షి. మరొక దురుద్దేశం లేదు...'

విచారణ మధ్యాహ్నందాకా కొనసాగింది. దొమ్మికి వచ్చినంతమంది గాకపోయినా అందులో సగానికి సగంమంది సదస్యులుగా విచ్చేశారు. తలకు పాగాలు చుట్టుకున్న పెద్ద పెద్ద పోలీసు వుద్యోగులు వచ్చారు. రాకేం చేస్తారు? తస్కరింపబడినవి భగవంతుడి నగలు! కాజేసినవాడు పూజారి! కానీ వచ్చిన వాళ్ళందరికీ ఆశాభంగమే కలిగింది. విచారణ రసవత్తరంగా కొనసాగడంలేదు. ఎప్పుడు లేచినా రాళ్లవంక దగ్గరే తెల్లవారినట్టు, ఏ వైపునుంచీ ప్రారంభించినా ఆచార్లు ఒకే ఒక్క సమాధానం చెబుతున్నాడు. దోషి తన దోషాన్ని ఒప్పుకోకపోయినంత మాత్రాన ఈ కేసుకు వచ్చిన ముప్పేమీ లేదు. సాక్ష్యాలు బలీయంగా వున్నాయి. నేరం కట్టుదిట్టంగా రూపొందడానికి వున్న సాక్ష్యాలు చాలు!

“ఇంకా మాట లెందుకూ! తీసుకెళ్లి వాన్‌లో కూర్చోబెట్టండి...” అన్నాడు విసుగెత్తిన అధికారి.

ఇద్దరు పోలీసులు ఆచార్లును సమీపించారు.

నేలవైపు చూస్తున్న ఆచార్లు తల పైకెత్తి చుట్టు ప్రక్కల కలయజూచాడు. బొంతజెముడు చెట్టుచాటున నిల్చుని కనకం అతడి వైపు దీనంగా చూస్తోంది.

దగ్గరికొస్తున్న పోలీసుల్ని చూచాడు ఆచార్లు. ఒక్క వేటుతో తెగనరికిన అరటిచెట్టులా అతడు నేల పైన కూలిపోయాడు. “మన్నించండి బాబూ! నేనే పాపమూ ఎరుగను. కావలిస్తే నన్ను తిట్టండి. కొట్టండి. చిత్రహింస పెట్టండి. అంతేగానీ నన్నూ, అమ్మాయినీ వేరు చెయ్యకండి...” అంటూ నెత్తిన చేతులుంచుకుని బావురుమని ఆక్రోశించాడు ఆచార్లు.

తెల్లవారగానే ప్రారంభమైన ఈ హఠాత్సంరంభానికి కారణమేమిటో కనకానికి స్పష్టంగా తెలియడం లేదు. ఆ రోజు వుదయం అయిదు గంటలకే ఆమె నిద్ర లేచింది. వసారాలో ఆచార్లు పడుకున్న సూచనలు లేవు. ఆమె తండ్రికోసం యిల్లంతా కలయదిరిగింది. ఆదరా బాదరా గుట్ట దిగివెళ్లి రామినాయుడుగారి మామిడితోపంతా అన్వేషించింది. ఎక్కడా తండ్రి జాడ కనిపించడంలేదు. ఎలుగెత్తి పిలిస్తే వినిపిస్తుందేమో! కానీ తనకు ఎలుగెత్తి పిలవడం చేతగాదని తెలియదూ? ఒంటరిగా యిలా దిగవిడిచి వెళ్లిపోతే తను బెంగపడిపోతుందని తెలియదూ?...కనకం మళ్లీ గుట్టపైకి తిరిగొచ్చేసరికి ప్రొద్దు పొడిచింది. నిమ్మకు నీరెత్తినట్టు నిశ్చలంగా వున్నాయి కొండ కోనలు. నీరెండ పడుతున్న గుడి గోపురం పైన పావురాలాడుకుంటున్నాయి. కనకం హృదయమొకటి తప్ప మిగిలిన ప్రపంచమంతా నిమ్మళంగానే వున్నట్టుంది !

చెదరిపోయిన ముంగురులతో, విడిపోయినజడతో, మంచుపూట తిరిగి తిరిగీ దుమ్ము కొట్టుకపోయిన పాదాలతో ఖిన్నురాలై యింటి ముంగిట నిల్చుంది కనకం.

ఆమె కళ్ల ఎదుట నాటకంలాంటి తతంగం ప్రారంభమైంది.

ఆచార్లును తీసుకొచ్చి గుడి ఎదుట నిల్చోబెట్టారు. జనం గుమిగూడి అతడకేసి విచిత్రంగా చూచారు. ఇక పోలీసులైతే చెప్పడానికి వీల్లేనంత కారుబారు చేశారు. ముఖాన కత్తివేటుకు నెత్తురు చుక్క లేకుండా ముసలాయన దిగాలుపడి నిల్చుండిపోయాడు.

విచారణ పూర్తయ్యేసరికి కనకాని కొక్క విషయం తెలిసింది. వీళ్ళు తండ్రిని తీసుకెళ్లిపోతున్నారు. ఎక్కడికి తీసుకెళుతున్నారో తనకు తెలియదు. ఎప్పుడు తిరిగొస్తాడో తెలియదు. అందాకా తన గతేమిటో తెలియదు.

రెక్కలు తెగి భూపతనమైపోతున్న పక్షిలా తండ్రి దగ్గరకు పరుగెత్తింది కనకం. పాదాలదగ్గర కూలబడి తీవెల్లాంటి చేతులతో అతడి కాళ్ళకు పెన వేసుకపోయింది. ఊహ తెలిసిన నాటినించి తనే ఎడ బాటునైతే వూహించలేదో, ఆ ఎడబాటునుగురించి తలచుకున్న కొద్దీ గుండె వ్రయ్యలైపోతుండగా కనకం కన్నీరు మున్నీరుగా విలపించింది.

కానీ ఒక దీనురాలి దుఃఖం కాలానికి కళ్ళెం వేయగలిగినంత శక్తివంతంగాదు. ఒక అనాథహృదయంలో వేదనాజ్వాల రగులుకున్నంత మాత్రాన జగన్నాటకం స్తంభించిపోదు. అమాయికు లెందరు మొత్తుకున్నా, అభాగ్యు లెందరు ఆక్రందించినా కాలచక్రం దొర్లిపోతుంది! జగన్నాటకం సాగిపోతుంది!

ఏకుస్తున్న కనకాన్ని తండ్రినుంచి వేరుచేయడం కాస్తా దుస్తరంగానే పరిణమించింది. కానీ మానవుడు సాధింపగలిగిన మహాకార్యాలతో పోల్చి చూచుకుంటే యిదేపాటిది! కనకం తండ్రినుంచీ వేరుగాకతప్పింది గాదు. ఆమె నామె రాతకొద్దీ అక్కడే వదిలిపెట్టి ఆచార్లు నెక్కించుకున్న మోటారు తుర్రుమన్న శబ్దంతో నాగరికప్రపంచంలోకి పారిపోయింది.

మానవుడి మనస్సు భరించగలిగిన భావోద్వేగ్నతకు సైతం ఎక్కడో ఒక చోట ఓ హద్దు వుండకపోలేదని పిస్తుంది. ఆ హద్దు దాటిన తర్వాత మనసు మొద్దుబారి పోతుంది. అలాంటి మానసిక స్థితిలో ధూళి దూసరితమైన వేషంతో శోకమే ఆకృతిదాల్చినట్టున్న కనకం లేచి నిల్చుంది. అటు పట్టుకొమ్మా లేక, యిటు ఊత కొమ్మా లేక నిస్సహాయురాలై పోయిన కనకాన్ని ఆదుకోడానికి ఎందరో ఆపద్బాంధవులు ముందుకొచ్చారు. కానీ మానవులంటే తగని భయం కనకానికి! ఆమెకు మగడంటే మరింత భయం! ఒక్క తండ్రి దగ్గర మాత్రమే కనకానికి చెప్పరానంత చనువు. స్వామిదగ్గర అంతకు రెట్టింపు చనువు!

—ఎలాగూ తండ్రి వెళ్లిపోయాడు. స్వామికి తోడుగా తనొక్కత్తె మాత్రమే మిగిలింది. తనుకూడా వెళ్లిపోతే స్వామిగతేం కావాలి? ఆయన కింత ప్రసాదం చేసి పెట్టేదెవరు? రోజుకొకరీతిగా ఆయనను సింగారించేదెవరు? ఆయనతో మూగభాషతో మాట్లాడే దెవరు?

గాలిని దూసుకపోతున్న బాణంలా రివ్వన ఇంటి లోపలికి వెళ్లిపోయి తలుపు మూసి గడియ వేసుకుంది కనకం.

ఆ తరువాత కనకం తరచుగా బయటికి వచ్చేది గాదు. ఒకానొక అపరసంజవేళ తల విరబోసుకుని నుదుట కానీకాసంత కుంకుమ బొట్టు పెట్టుకుని పూనకం వచ్చి తూలిపోతున్న గణాచారిలా ఆమె ఏ చెట్టు దగ్గరో, లేదా ఏ పొద దగ్గరో కనిపిస్తే మనుషులు జడుసుకుని దూరంగా పారిపోయిన సంఘటనలు కూడా వున్నాయి. కానీ మానవజాతిలో సాహసికులు లేకపోలేదు. దేవళంమిట్టపై కనకం అన్న పేరుతో సజీవంగా చరిస్తున్న అందాన్ని, యౌవనాన్నీ చూచి గ్రుక్కిళ్లు మ్రింగకపోవడం వాళ్ల స్వభావానికి విరుద్ధం. వాళ్లు వల విసరడమే పనిగా పెట్టుకున్నారు. 'పడిపోతుంది, పడిపోతున్నది, పడిపోయింది' అని ఒకరి నొకరు వూరించుకోవడమే అనుదిన వ్యాసంగంగా పెట్టుకున్నారు.

రోజులు గడచిపోతున్నాయి. బాలభానుడు తన చిరునవ్వులతో లోకాన్ని మురిపిస్తున్నాడు. మధ్యందిన మార్తాండుడు తన మామూలు ప్రకారం మండి పడిపోతున్నాడు. సాయంత్రమయ్యేసరికి వృద్ధుడైన ఆదిత్యుడి బోసినవ్వులతో పశ్చిమాకాశం రాగరంజితమౌతోంది. రాత్రికాగానే విరగబూసిన పుచ్చపువ్వులా వెన్నెల వ్యాపిస్తోంది. లేదా చీకటి లోకాన్ని కావిలించుకుంటోంది. అయితే గ్రుక్కెడు నీళ్లయినా దొరకని దేవళం మిట్టపైన, యిరుగుపొరుగుకు నోచుకోని ఒంటికొంపలో ఏకాకిగా మిగిలిపోయిన కనకం ఏం చేస్తోంది? ఏమైంది? ఎవరెవరికి ఎలాతోస్తే అలా చెప్పుకున్నారు. అక్కడే వుందన్నారు కొందరు. 'లేదు లేదు. మాయమైపోయిం'దన్నారు మరికొందరు.

మూడు మాసాల తర్వాత ఒక రోజు కోనలో మేకలు మేపుకుంటూ గుట్టపైకి వచ్చిన కాపు కుర్ర వాళ్ల పరిశోధన మూలంగా లోకులకు వాస్తవం తెలిసి వచ్చింది. కనకం మాయమైన మాట నిజం! కానీ నిజం అంత మాత్రమే గాదు. తమ పరిశోధనను మరికొంత విస్తృతం చేసుకుంటూ కాపుకుర్రవాళ్లు ప్రాకారం దాటి దేవళం లోపలికి వెళ్లారు. అక్కడ వాళ్లకు విరిగి పోయి క్రింద పడివున్న తాళం కనిపించింది. తలుపులు బారగిల తెరిచిన ద్వారంలోనుంచి శూన్యంగా వున్న మూలస్థానం కనిపించింది. చీకటికి సర్వాధిపత్యాలు కట్టబెట్టి, గబ్బిలాలకు యౌవరాజ్య పట్టాభిషేకం చేసి, విషభుజంగాల యథేచ్ఛా విహారణానికి వీలుగా దేవుడు కూడా మటుమాయమైపోయాడు!